
ప్రజాశక్తి
శుక్రవారం 22 నవంబర్ 2024
5



రూ.2 .70లక్షలకు వేలం పాట ఖరారు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాలిటీకి సంబంధించి తోటపల్లి హెడ్ వాటర్ వర్క్స్ పరిధిలో గల జీడి, మామిడి, కొబ్బరి చెట్ల ఫల సాయాన్ని మూడేళ్ళు అనుభవించుకునే హక్కుపై గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ విభాగం అధికారి రూబేను దిబ్బ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ వేలం పాటకు ఎద్దు సూరప్పమ్మ, బొత్స లక్ష్మి హాజరుకాగా, హెచ్చు పాటదారులైన ఎద్దు సూరప్పమ్మకు రూ.2 లక్షల 70 వేల,300 పాట ఖరారైంది. మున్సిపల్ కమిషనర్‌కు వేలంపాటకు సంబంధించిన మొదటి విడత నగదును పాటదారులు అందజేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరగాల్సిన ఈ వేలం పాట ఐదు సార్లు వాయిదా పడితూ వచ్చింది. 8నెలల తర్వాత పాట ఖరారు కావడంతో మున్సిపల్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

లైంగిక దాడికి పాల్పడిన నిందితులపై

కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రేమ పేరుతో విశాఖలో లా విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ వాకాడ ఇందిరా డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని శిక్షించాలని కోరుతూ ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు, జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ నిరసనలో ఇందిర, ఐద్వా నాయకులు భారతి, వరలక్ష్మి మాట్లాడుతూ మొన్న ట్రైనీ డాక్టర్‌పైన అత్యాచారం, హత్య జరిగిన సంఘటన మరవక ముందే రెండు రోజుల క్రితం విశాఖ నగరంలో న్యాయ విద్యార్థినిని ప్రేమపేరుతో నయవంచన చేసి దారుణంగా అత్యాచారం వంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలపై సామాజిక స్పృహను పెంచేందుకు రాష్ట్రవ్యాపితంగా ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టాలనిచ అలాగే విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను నిషేధించాలని అన్నారు. దుర్మార్గాలు, అకృత్యాలు పునరావృతం కాకుండా మహిళలు, విద్యార్థులు సంఘటితంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ఆ దిశగా దుర్మార్గులకు కఠిన శిక్ష పడేదాకా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, అంగన్వాడీ కొమరాడ ప్రాజెక్టు కార్యదర్శి అనురాధ, సెక్టార్ లీడర్ పుష్ప లలిత, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, జూనియర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.



కొమరాడలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు ఐద్వా నాయకులు

బలిజిపేటలో కొవ్వొత్తులతో ప్రదర్శన



బలిజిపేటలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు

బలిజిపేట : విశాఖలో లా విద్యార్థిపై లైంగిక దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని బలిజిపేటలో కొవ్వొత్తులతో ఐద్వా, సిఐటియు నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, ఐద్వా నాయకులు లక్ష్మమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు, విద్యార్థులకు రక్షణ కరువైందని, ఈ వైఫలాలకు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వందేనని అన్నారు. విశాఖలో లా విద్యార్థి పై జరిగిన లైంగిక దాడిని ఖండిస్తూ తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న దాడుల్లో సుమారు 96 మంది వరకు మహిళలు బలి పశువులుగా మారారని, దీనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రతిరోజు మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, మద్యం, ఇసుక మాఫియాలపై ఉన్న శ్రద్ధ మహిళల రక్షణపై లేదని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని, పోర్న్ వెబ్ సైట్లను రద్దు చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో మహిళలు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- బొబ్బిలి, సాలూరు సరిహద్దు భూములపై కన్నేసిన వ్యాపారి
- టిడిపి నాయకుడి అండతో దందా

ప్రజాశక్తి - సాలూరు

బొబ్బిలి, సాలూరు మండలాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న గిరిజన భూములను కబ్జా చేయడానికి బాగువలసకు చెందిన ఓ వ్యాపారి స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. రెండు మండలాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న కొయ్యకొండవలస గ్రామం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని అప్పనంగా కొట్టేయడానికి ఆ వ్యాపారి ప్రణాళిక రూపొందించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు సమీపానున్న కొండవాగుని ఆక్రమించేందుకు ఆ వ్యాపారి జెసిబి సాయంతో చదును చేసే పనులు కూడా చేపట్టారు. గ్రామానికి చెందిన గిరిజనులు వ్యతిరేకిస్తున్నా రాత్రి వేళల్లో వాగు చదును చేసే పనులు చేపట్టారు. ఇదంతా మండలంలోని బాగువలస గ్రామానికి చెందిన టిడిపి నాయకుడి కనుసన్నల్లోనే జరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. కొండపై నుంచి వర్షం నీరు కిందనున్న జామి చెరువులోకి చేరుతుంది. జామి చెరువు కింద నలుగురు గిరిజన రైతులు భూమి సాగు చేస్తున్నారు. ఈ చెరువును కలిపి కబ్జా చేయడానికి ఆ వ్యాపారి ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలిసింది. అధికారపార్టీ అగ్రనేతల ఆశీస్సులు పుష్కలంగా ఉన్న బాగువలస టిడిపి నాయకుడి అండ చూసుకుని వ్యాపారి గిరిజనులపై బెదిరింపులకు దిగినట్లు సమాచారం. అయితే గిరిజనులు తీవ్రంగా ప్రతిఘటించడంతో వాగు చదును చేసే పనులు నిలిపివేశారు. ఈ ప్రాంతంలో అటవీశాఖకు చెందిన భూమిని కైంకర్యం చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.



జెసిబి సాయంతో వాగును కప్పేస్తున్న ఆక్రమణదారుడు

విడివికెలను బలోపేతం చేయాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట


స్థానిక ఐటిడిఎ పరిధిలో గల విడివికెలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఎపిఎంలతో నిర్వహించిన సమావేశంలో పిఒ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ వీడీవీకేల్లో చేపడుతున్న గిరిజన ఉత్పత్తులను పెంచాలన్నారు. అలాగే గిరిజన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విడివికెల్లో ఉత్పత్తి చేసిన గిరిజన ఉత్పత్తుల్లో నాణ్యత తగ్గకూడదన్నారు. ఏడాది పొడుగునా విడివికెల్లో వివిధ ఉత్పత్తులు ఉత్పత్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఎపిఒ జి.చిన్నబాబు మాట్లాడుతూ మూసివేయబడిన విడివికెలను మరల తెరిచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. విడివికెల ద్వారా ఆర్గానిక్ ఉత్పత్తులను ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించాలన్నారు. ఐటిడిఎ ద్వారా మైక్రో ప్రాజెక్ట్ రుణాలను ఇచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గతంలో ఇచ్చిన స్త్రీనిధి రుణాలను రికవరీ చేయాలని అన్నారు. విడివికెల్లో అన్ని రకాల రిజిస్టర్లు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిడి సన్యాసిరావు, డిపిఎం ఆర్‌వి రమణ, టిఎస్‌పి, ఎపిఎంలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయకపోవడం అన్యాయం

- రైతు సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి
- 27న తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల చాలా కర్కశంగా వ్యవహరిస్తుందని, రైతుల గోడు పెడచెవిన పెడుతోందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ధాన్యం కొనుగోలు చేపట్టక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల వద్ద ధాన్యం సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం ఇంకా పూర్తి స్థాయిలో కొనుగోలు ప్రారంభించలేదన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2300కు ధాన్యం ఎక్కడా కొనుగోలు చేయడం లేదని చెప్పారు. దీనిపై ప్రభుత్వం దగ్గర ఎలాంటి ప్రణాళిక లేకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. గత ప్రభుత్వం కంటే తమ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని కోరుకుంటుందని ప్రతిరోజు డిప్యూటీ ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి ఆర్భాటపు ప్రకటనలు తప్ప రైతుకు ఎటువంటి భరోసా లేదని విమర్శించారు. ప్రతిరోజూ జిల్లా నుంచి లారీలతో ధాన్యం బయటకు పోతున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. దళారులు, మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. గోనె సంచులు కూడా రైతులకు పంపిణీ చేయడం లేదని చెప్పారు. ప్రభుత్వం ఒక గోనె సంచికి రూ.3.39 చెల్లించడం వల్ల నష్టం పోయే పరిస్థితి ఉందన్నారు. ఈనెల 26లోగా కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభించకపోతే 27న జిల్లా కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

అదానీతో ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరు

దేశంలో విద్యుత్ ప్రాజెక్టులు దక్కించుకోవడానికి వేల కోట్లు అధికారులకు అదానీ లంచాలు ఇచ్చాడని, అమెరికాలో ఇండియన్ కోర్టులో కేసు నమోదు నేపథ్యంలో మన రాష్ట్రంలో చేసుకున్న ఒప్పందాలన్నింటిని వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు, ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సాలూరు మండలంలో కురుకూటి ప్రాంతంలో ఆరు గ్రామాల పరిధిలో 750 ఎకరాలు అదానీ పవర్ ప్రాజెక్టు కోసం కేటాయించారని, దీన్ని సిపిఎం గతంలో వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిందని చెప్పారు. ఇదే తరహాలో రాష్ట్రంలో కూడా దీంతో పాటు నాలుగు జిల్లాల పరిధిలో అదానీ ప్రాజెక్టుల కోసం 11 వేల ఎకరాలు అదానీకి కేటాయింపులు జరిగాయని తెలిపారు. వెంటనే ఈ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో డేటా సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదానీ కోసం రాష్ట్రంలో కేటాయించిన భూములన్నీ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.175 కోట్లు లంచాలు తీసుకున్న అవినీతి అధికారులపై దర్యాప్తు చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెబీ ఒప్పందాలు రద్దుచేసి, ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో గ్రీన్ ఎనర్జీ సరఫరా చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

పెద్దగెడ్డ ప్రాజెక్టును పరిశీలించిన జైకా బృందం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పెద్దగెడ్డ ప్రాజెక్టును గురువారం జైకా బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా పెద్దగెడ్డ స్పిల్ వే సాగునీటి కాలువల ఆధునీకరణ పనులను ఖరీఫ్ అనంతరం పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను జైకా బృందం ప్రతినిధి షాప్ జెన్ ఆదేశించారు. పనుల నిలుపుదలపై ఆరా తీశారు. పనుల నిలుపుదలపై గుత్తేదారునికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్వహణకు రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయింపు జరిగిందని, కావున ఆధునీకరణ పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఆయన వెంట ఇఇ ఆర్.అప్పలనాయుడు, డిఇ శ్రీనివాసరావు, మోహనరావు. ఎఇలు పాల్గొన్నారు.



పెద్దగెడ్డ కాలువను పరిశీలిస్తున్న జైకా బృందం ప్రతినిధులు

వట్టిగెడ్డ రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలి

జియ్యమ్మవలస : మండలంలో ప్రధాన సాగునీటి వనరైన ఒట్టిగెడ్డ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని జైకా ప్రతినిధి షాప్‌జెన్ అన్నారు. నిప్పల్ కోయి కంపెనీ నుండి జైకా నిధులతో ఒట్టిగెడ్డ ఆధునీకరణ పనులు ఇకపై వేగవంతం చేయాలని ఆయన అధికారులు ఆదేశించారు. సాగునీటి ఇంజనీరింగ్ అధికారులతో రావాడ ఒట్టిగెడ్డ జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైకా నిధులతో ఇప్పటివరకు ప్రాజెక్టులో పెండింగ్లో ఉన్న పనులన్నీ పూర్తి చేయాలని, రైతులకు సాగునీరందించేందుకు వచ్చే సీజన్ కల్లా సిద్ధంగా ఉండేందుకు సత్వరమే పనులు చేపట్టాలని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు తక్కువగా ఉండడంతో పనులు కూడా చేసేందుకు అనుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, ఆర్.రామ్మోహనరావు, సుగుణాకరరావు, ఆర్.అప్పలనాయుడు, డి.రవికుమార్, ఎం.సత్యప్రసాద్, జివి రఘు, వినయ్, సాయిలక్ష్మి, కన్స్ట్రక్షన్ ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై శ్రద్ధ చూపండి : ఎమ్మెల్యే

పార్వతీపురం రూరల్ : రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లాగా పేరుగాంచిన ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పార్వతీపురం నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూసి, అభివృద్ధికి చర్యలు తీసుకోలని గురువారం జరిగిన శాసనసభ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర కోరారు. ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలో 8 వెనుకబడిన జిల్లాల ప్రగతిపై వివరాలు వెల్లడి చేయాలని, ఆయా జిల్లాలకు చెందిన నియోజకవర్గాల్లో విద్య, వైద్యం, ఉపాధి, విద్యుత్తు, తాగునీరు వంటి వాటిపై ప్రభుత్వం తీసుకునే చర్యలు వివరించాలని ఆయన కోరారు. ఇక్కడ ప్రజల జీవన పరిస్థితుల గురించి సర్వే నిర్వహించి, వాటి ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని శాసనసభలో కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎస్‌సి, ఎస్‌టి మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్థానిక ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం కలెక్టరేట్ సెల్లారులో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పిఒ మాట్లాడుతూ జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని, స్థానికంగా ఉన్న వనరులను ఉపయోగించుకుని జిల్లాను ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. మత్స్యకారులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా మత్స్యశాఖ అధికారికి సూచించారు. మత్స్యకారులకు ఐటిడిఎ తరపున సహాయ సహకారం ఉంటుందని పిఒ అన్నారు. గత నెల సీతంపేటలో కార్యక్రమాలను నిర్వహించామన్నారు. జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో మరిన్ని అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో చేపల వేట చేస్తున్నారని, టెక్నికల్‌గా చేపల వేటను చేపట్టాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. టెక్నికల్ శిక్షణకు ప్రతిపాదనలు సమర్పించాలని మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. తోటపల్లి రిజర్వాయర్ లైసెన్స్ మంజూరుకు దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. తోటపల్లి రిజర్వాయర్ చుట్టూ నాలుగు మండలాలున్నాయని, లైసెన్స్ మంజూరుకు సమగ్ర నివేదిక ఇవ్వాలని మత్స్య శాఖ అధికారికి పిఒ ఆదేశించారు. సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న చెరువులు, జల వనరులలో కొత్త చేపల పెంపకానికి నిధులు మంజూరు చేస్తున్నామని అన్నారు. కొత్త పద్ధతుల ద్వారా నాణ్యత, పరిమాణం వచ్చేలా ఆరోగ్యకరమైన చేపలు వచ్చేలా ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. చేపల విక్రయం కోసం మత్స్యకారులకు కూలింగ్ బాక్స్‌లు కలిగిన స్కూటర్లు, ఫ్రిజ్‌లు ఉన్న ఆటోలను సబ్సిడీ ద్వారా అందజేశామని తెలిపారు. అక్టివ్గా ఉన్న మత్స్య సంఘాలకు ఇచ్చే స్కూటర్లు, ఆటోల్లో 50శాతం మహిళా మత్స్యకారులకు ఇవ్వాలని తీర్మానించినట్టు పిఒ పేర్కొన్నారు. మత్స్య సంపద అభివృద్ధికి మహిళా మత్స్యకారుల కృషి ఉందన్నారు. చేపల చెరువులు మహిళలకు ఇస్తే, మహిళలు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. ఒకే రకమైన చేపలను పెంచకుండా, వాతావరణానికి అనుగుణంగా కొత్త రకం చేపలను పెంచాలని సూచించారు. రొయ్యల పెంపకంతో అధిక ఆదాయం లభిస్తుందని అన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య మాట్లాడుతూ మత్స్యకారులకు వలలు, వేటకు అవసరమైన పరికరాలను పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల ద్వారా ఇస్తామన్నారు. మహిళా మత్స్యకారులకు ప్రభుత్వం సబ్సిడీపై స్కూటర్లను అందిస్తుందని పేర్కొన్నారు. మత్స్యకారులంతా జిల్లా మత్స్య సంపద అభివృద్ధిపై దష్టి పెట్టి, లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాలకొండ, సాలూరు డివిజనల్ మత్స్య శాఖ అధికారులు,పార్వతీపురం మత్స్యకార మహిళా సంఘ అధ్యక్షురాలు రాజు, ట్రైబల్ సంఘ నాయకులు చిన్నారావు, మత్స్యకార సంఘ నాయకులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మత్స్య దినోత్సవం

మత్స్యకారులకు మోటారు సైకిళ్లు, ఆటోలు పంపిణీ



లబ్ధిదారులకు ఐస్‌బాక్సులను అందజేస్తున్న ఐటిడిఎ పిఒలు

సీతంపేట : మత్స్య సంపద ద్వారా ఆదివాసీ కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చవచ్చని ఎపిఒ జి.చిన్న బాబు, నాబార్డ్ డిడిఎం దినేష్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం వాసన్ సంస్థ ఆధ్వర్యంలో నౌగుడలో ఆదివాసీ మత్స్యకార రైతులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వాసన్ సంస్థ చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ మోడల్‌లో భాగమైన నాటుకోళ్ల పెంపకం షెడ్లను ప్రారంభించారు. అనంతరం రైతులతో సమావేశమై, వారి కుటుంబ జీవనాధార ప్రధాన వనరులపై చర్చించారు. మోలా చేపలు పెంపకంతో రైతులకు అధిక పోషక విలువలతో పాటు విటమిన్లు, కాల్షియం, ఐరన్, జింక్, పొటాషియం మరియు ముఖ్యమైన కొవ్వు ఆమ్లాలు అందుతుందని తెలిపారు. మోలా ఫిష్ పెంపకం ప్రాజెక్టును ప్రాథమిక దశగా ప్రారంభించగా, ఇది పౌష్టికాహార భద్రతకు మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధులు ఎం. సన్యాసిరావు, డికె పాత్రో, ప్రియాంక, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సి నుంచి మినహాయింపు ఇవ్వాలి

- కొనసాగుతున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల దీక్షలు
- యుటిఎఫ్, గిరిజన సంఘం, వైసిపి, మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు డిఎస్‌సి నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన్‌రావు డిమాండ్ చేశారు. తమను కాంట్రాక్టు ఉపాధ్యా యులుగా మార్చాలని కోరుతూ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల స్థానిక ఐటిడిఎ వద్ద తలపెట్టిన దీక్షలకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 20 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా మార్చడం న్యాయ సమ్మతమని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేయాలని మురళీమోహన్ రావు కోరారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఎన్.దివాకర్, ఎ.రమేష్, టిరాజేష్, వెంకటేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న మురళీమోహనరావు

సీతంపేట :గిరిజన గురుకుల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులు తమ సమస్యలు పరిష్కరించాలని ఐటిడిఎ ముఖ దరం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఔట్సోర్సింగ్ చేస్తూ ఉపాధ్యాయులను అధ్యాపకులను క్రమబద్ధీకరించి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. వీరికి మాజీ ఎమ్మెల్యే వి.కళావతి, గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, ఎం.లక్ష్మణరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, ధర్మారావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పనివేళల మార్పుపై ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

పాఠశాలల పని వేళలు మార్పు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయలేమని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు గురువారం డిఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, వినతి పత్రం అందజేశారు. పనివేళల పెంపుతో విద్యార్థులకు ఒనగూరే ప్రయోజనమేమీ లేదని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. అలాగే దూర ప్రాంతాల నుంచి విద్యార్థులకు ఇబ్బంది ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహన్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకృష్ణ, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు కె.విజయకుమార్, హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షులు పిసిహెచ్ శ్రీనివాసరావు, సాప్ జిల్లా అధ్యక్షులు యు గోవింద్, ఎస్సీ ఎస్టీ యు ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి నారాయణరావు,, ఎపిటిఎఫ్ (1938) జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి గైర్హాజరైతే చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - మక్కువ

మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు ఎవరూ గైర్హాజరు కావద్దని, అలా ఎవరైనా ఉద్దేశపూర్వకంగా సమావేశానికి రాకుండా ఉంటే వారిపై తగు చర్యలకు కలెక్టర్‌కు నివేదిస్తామని ఎంపిడిఒ డిడి స్వరూపరాణి హెచ్చరించారు. ఈ నెల 26న మండల సర్వసభ్య సమావేశం జరగనుందని ఆమె తెలిపారు. గత సమావేశాల వివరాలకు సంబంధించి ఈనెల 24లోపు అధికారులు నివేదిక ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులంతా హాజరుకావాలని ఆమె కోరారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎపిఒ చినబాబు

పాఠశాల నిర్వహణ భేష్ : ఎపిఒ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాబు ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ ఎపిఒ జి.చినబాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశీలించారు. మెనూ చక్కగా అమలు, వండిన ఆహార పదార్థాలు రుచికరంగా ఉండడం, పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచడం వంటి వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ చాలా బాగుందని ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇ సుకుమార్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

నేత్ర శస్త్ర చికిత్సలకు తరలింపు


ప్రజాశక్తి - కొమరాడ

జిల్లాలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నేత్ర శస్త్రచికిత్సకు పలువుర్ని తరలించినట్లు నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలో గల గ్రామాల్లో 20రోజులుగా నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాల్లో చేసిన నేత్ర పరీక్షల్లో కేటరాక్ట్ (అంతర కుసుమం), టేరిజియం(కొయ్యకండ) ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కోసం స్థానిక పిహెచ్‌సి నుంచి విజయనగరం పుష్ప గిరి కంటి ఆసుపత్రికి గురువారం తరలించారు. వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్ళ జోళ్లు, మందులు కల్పిస్తామని చెప్పారు. శస్త్ర చికిత్సలకు వెళ్తున్న రోగులకు పలు సూచనలు, జాగ్రతలు వివరించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు రమేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సచివాలయాల జిల్లా ప్రత్యేక అధికారి రామ్ గోపాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం సచివాలయల కార్యదర్శులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థ ద్వారా ఏజెన్సీలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందించాలని కోరారు. సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే జగదీశ్వరి దంపతులను సన్మానిస్తున్న నియోజకవర్గ టిడిపి నాయకులు

ఎమ్మెల్యే జగదీశ్వరిని సన్మానించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విప్ పదవి వచ్చిన సందర్భంగా అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, జియ్యమ్మవలస మండల పార్టీ అధ్యక్షులు పల్ల రాంబాబు, గరుగుబిల్లి టిడిపి మండల సీనియర్ నాయకులు జగదీష్, రామారావు విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మారుమూల ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యే జగదీశ్వరికి విప్ పదవి ఇవ్వడం సంతోషకరమన్నారు.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - కురుపాం

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సేనాపతి శేఖర్ పాత్రుడుకు కురుపాం కాపు సంఘ నాయకులు కలిశెట్టి కొండయ్య ఆధ్వర్యంలో గురువారం మాదలంగిలోని తన నివాసం వద్దకు వెళ్లి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులను గుర్తించి కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇవ్వడం ఆనందదాయకమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కాపు కులస్తులు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో కాపు నాయకులు మంతిని త్రిపుర నాథ్, నేరేడుబిల్లి వంశీ, బలగ రామకష్ణ, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


తప్పనిసరిగా ఎన్‌పిసిఐ లింక్ చేసుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులు భారత తపాల శాఖ ద్వారా ఎన్‌పిసిఐ లింకు చేసుకోవాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ లబ్ధిదారులను కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తపాలా శాఖ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకం పొందుతున్న ప్రతి లబ్ధిదారునికి అవగాహన కల్పించి ఎన్పీసీఐ లింక్ చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యంనాయుడు, ఎపిఎం కె.రాము, స్థానిక సబ్ పోస్టుమాస్టర్ ఎస్.కృష్ణ, పోస్ట్మాన్ టి.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎసి మాజీ ఉపాధ్యక్షునికి పితృవియోగం

ప్రజాశక్తి - వీరఘట్టం



మండలంలో తెట్టంగికి చెందిన పాలకొండ ఎఎంసి మాజీ ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు తండ్రి అచ్చంనాయుడు(95) గురువారం మృతి చెందారు. అచ్చంనాయుడు గతంలో మాజీ ఉప సర్పంచిగా పనిచేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాస రాయ కళావతి మృతదేహాన్ని నివాళ్లు అర్పించి, లక్ష్మణరావు కుటుంబ సభ్యులు ఓదార్చారు.

20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని వలసబల్లేరు పంచాయతీ వలసగూడలో గురువారం 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు నీలకంఠపురం ఎస్సై నీలకంఠరావు తెలిపారు. ముందస్తు సమాచారం ప్రకారం వలసగూడకు చెందిన పాలక ధర్మన్న నాటుసారా అమ్ముతుండగా పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

దుకాణం దగ్ధం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని నంద గ్రామంలో బుధవారం అర్ధ రాత్రి వారణాసి వెంకటేష్‌కు చెందిన దుకాణం అగ్నికి ఆహుతి అయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒకేసారి మంటలు చెలరేగడంతో దుకాణం మొత్తం ఖాళీ బూడిదైంది. దుకాణం సమీపాన ఉన్న ఎస్.శ్రీను అనే గిరిజనుడి పెంకుటిల్లు కూడా పాక్షికంగా తగలబడింది. దుకాణదారునికు సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆయన కోరుతున్నాడు.



ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

వేతనాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల నిరసన

ప్రజాశక్తి - సీతానగరం

పది నెలల వేతన బకాయిలను తక్షణం చెల్లించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్లు గురువారం నిరసన తెలిపారు. ఈ మేరకు సిఐటియు జిల్లా కార్యదర్శి యమ్మల మన్మధరావు, మండల కార్యదర్శి గవర వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా 2015లో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, తద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడాలనే సదుద్దేశంతో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమం ద్వారా గ్రీన్ అంబాసిడర్లను నియమించిందన్నారు. వీరికి స్వచ్ఛభారత్ కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించేవారు. తదుపరి కాలంలో వీరిని పంచాయతీలకు అప్పగించిన తర్వాత వీరి కష్టాలు మొదలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీలు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని, కొన్నిచోట్ల పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు వీరికి రూ.6వేలు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.1500, రూ.3వేలు ఇస్తామని, అందుకు మీరు అంగీకరించాలని అలా అయితే తక్షణమే జీతాల బిల్లులు పెడతామని, అధికార పార్టీ సర్పంచులే ఇలా అనడం సిగ్గుచేటని అన్నారు. ఇలాంటి నిరంకుశ పోకడలు మానుకోవాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని, గ్లౌజులు, సబ్బులు, కొబ్బరి నూనె సరఫరా చేయాలని, చెత్తఎత్తే రిక్షా బండ్లకు మరమ్మతు పనులు చేయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల అధ్యక్షులు జలుమూరు గౌరు, గుంట పోలయ్య, తోట రాము, సిహెచ్ శివున్నాయుడు, పెంకి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ప్రధాన రహదారి పక్క మేడపై చేపడుతున్న అక్రమ నిర్మాణాలు

జోరుగా అనధికార నిర్మాణాలు

కన్నెత్తి చూడని ప్రణాళికా విభాగం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో ఏ వార్డుల్లో చూసినా అనధికారంగా భవన నిర్మాణాలను సంబంధిత యజమానులు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అనుమతులను తీసుకోకుండానే బరితెగించి పనులు సాగిస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న కుమ్మర వీధి ముందర ఉన్న షాపులపైన, ప్రధాన రహదారి పక్కనే ఉన్న బోటు వారి బంద గట్టుపై ఉన్న షాపులపైనా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. బంధంవారి వీధిలో కెనరా బ్యాంక్ ఎదురుగా రెండు అంతస్తుల పురాతన భవనంపై శ్లాబ్ వేస్తున్నారు. అదే వీధి శివారులో సెంట్ పీటర్ స్కూల్ ఎదురుగా, పాత బస్టాండ్ దగ్గరలో ఉన్న ఎస్ఎన్ఎం మూర్తి నగర్, బై పాస్ రోడ్ కు ఇరువైపులా భవన నిర్మాణాలు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పట్టణంలో యథేచ్ఛగా అనధికార భవన నిర్మాణాలు జరుగుతున్న తీరుపై కొత్తగా వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారి దృష్టి పెట్టి మున్సిపల్ ఆదాయాన్ని పెంచేలా పర్యవేక్షించాలని, సంబంధిత యజమానులపై చర్యలు చేపట్టే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మునగ మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని 140 అంగన్వాడీ కేంద్రాలకు 10 చొప్పున మునగ మొక్కలను ఎంపిడిఒ బివిజె పాత్రో, ఎపిఎం సత్యనారాయణ గురువారం పంపిణీ చేశారు. రక్తహీనత నివారించేందుకు మునగాకు ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. గర్భిణీ, బాలింతలకు తప్పనిసరిగా తీసుకోవాలని, పిల్లలకు రోజూ పప్పులో వేసి పెట్టాలని సిడిపిఒ బి.అనంతలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ సుందర పార్వతీపురమే లక్ష్యం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

స్వచ్ఛసుందర పార్వతీపురం లక్ష్యంగా అంతా కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో స్వచ్ఛ సుందర పార్వతీపురంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న వనరులను ఉపయోగించుకుని, వ్యర్థాలను తొలగించి, తడి, పొడి చెత్తను వేరు చేసి సకాలంలో వ్యర్థాలను సేంద్రీయ, అకర్బన భాగాలుగా విభజించడం వల్ల పార్వతీపురంలో చెత్త సమస్యను పరిష్కరించుకోవచ్చని అన్నారు. వినూత్న ఆలోచనలతో జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం తీసుకురావాలని ఆయన కోరారు. జిల్లాలో స్వచ్ఛ అభియాన్, స్వచ్ఛ సంకల్ప్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నప్పటికీ కొన్ని గ్రామాల్లో బహిరంగ మల మూత్ర విసర్జన కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే ప్రతి పంచాయతీ ఆదర్శవంతంగా ఉంచాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. పంచాయతీల్లో దోమలు వృద్ధి చెందకుండా ప్రతి వీధిలో దోమలమందు స్ప్రే చేయాలని సూచించారు. మురుగు నీరు కాలువల్లో నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచి చుట్టూ బ్లీచింగ్ చల్లాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయం జిల్లా నోడల్ బి.రామగోపాల్, ఎంపిడిఒ, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విక్రంపురంలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని విక్రంపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు మధుమేహం, రక్త పోటు, జ్వర పీడితులకు తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, ఎంఎల్ హెచ్‌పి, ఆశా కార్యకర్తలు, 104సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ టి.లోకనాథం అన్నారు. గురువారం పెద్దగొత్తిలి రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో అందించిన మినుములు, శనగలు, చోడి విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకొని వేసవి పంటలు వేసి అధిక లాభాలు సాధించి, లాభసాటి పంటలు పండించే దిశగా రైతులు ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ భార్గవి , రైతులు పాల్గొన్నారు.

ఎన్ఆర్‌సి కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక జిల్లా ఆసుపత్రిలో గల పోషకాహార పునరావాస కేంద్రాన్ని (ఎన్ఆర్సి) వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు గురువారం పరిశీలించారు. ఈ కేంద్రంలో చేరిన ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్య వివరాలను కేస్ షీట్‌లో పరిశీలించారు. కేంద్రంలో చేరినప్పుడు బరువు, ఎదుగుదల ప్రస్తుత బరువు ఏ మేరకు వృద్ధి చెందిందో గమనించారు. అలాగే ప్రతి రోజూ ఎన్ఆర్సిలో పిల్లలకు ఇస్తున్న పోషకాహార మెనూ గురించి అడగ్గా రోజుకు ఏడుసార్లు అందజేస్తున్నామన్నారు. ప్రతి నెలా చేరుతున్న పిల్లల వివరాలను రికార్డులో పరిశీలించి బరువు, ఆరోగ్యం వృద్ధి చెందిన తర్వాత మాత్రమే డిస్చార్జ్ చేయాలన్నారు. మందులను పరిశీలించారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ అక్కడ పిల్లల తల్లి దండ్రులతో మాట్లాడి వారి ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రాల్లో పిల్లలకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు ప్రభుత్వం బకాయి పడ్డ ఐదు నెలల వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా నాయకులు వై.శాంతి కుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల విద్యా వనరుల భవనం వద్ద శానిటేషన్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులకు వేతన బకాయిలతో పాటు రెండు జతల యూనిఫారం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సబ్బులు, గ్లౌజులు, కొబ్బరి నూనె సరఫరా చేయాలి, రాజకీయ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఇఒ జి.సూర్య దేముడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలంలో గల శానిటేషన్ వర్కర్లు అనూష, గౌరమ్మ, సత్యవతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ స్థానిక ఎంఇఒ కార్యాలయం ఎదుట ఎపి ప్రభుత్వ పాఠశాల, కళాశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా అనంతరం ఎంఇఒకు వినతి పత్రం అందజేశారు.

ఎంఇఒ కార్యాలయం వద్ద శానిటేషన్ కార్మికుల నిరసన



పాలకొండలో ఎంఇఒకు వినతిని అందజేస్తున్న పాఠశాలల శానిటేషన్ కార్మికులు

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ 50 మంది విద్యార్థులకు ఒక ఆయా నియమించాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని, ప్రమాద బీమా, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిని అందజేసిన వారిలో యూనియన్ ప్రతినిధులు బి.చిన్నమ్మడు, బి.గౌరి, పి.జ్యోతి, యు.నరసమ్మ, పి.ధనలక్ష్మి, ఎ.రూపవతి, జి.రాములమ్మ, సిఐటియు మండల కార్యదర్శి కాద రాము తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: సమస్యల పరిష్కారం కోరుతూ పాఠవాల శానిటేషన్ కార్మికులు స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, సిబ్బందికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మమ్మ మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతభత్యాలు పెంచాలనీ, కనీస మౌలిక సదుపాయాలు, మాస్కులు, గ్లౌజులు, యూనిఫామ్, గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు తులసి, రజిని, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నిక వాయిదా

ప్రజాశక్తి - పార్వతీపురం

సాగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణ షెడ్యూల్ మారిందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు నీటి వినియోగ దారుల సంఘాల ఎన్నికలపై సంబంధిత అధికారులతో గురువారం టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి మారిన షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 5న నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని చెప్పారు. అదే రోజున అసాధారణ సమావేశం నిర్వహించే ప్రదేశాన్ని ప్రచురించిందన్నారు. 8న ఎన్నికల అధికారి నేతృత్వంలో నీటి వినియోగదారుల సంఘాలు అసాధారణ సమావేశం జరుగుతుందని, అదే రోజున మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. 11న ఎన్నికల అధికారి నేతత్వంలో నీటి పంపిణీ సంఘాలు (డిస్ట్రిబ్యూటరి) ఎన్నికలకు అసాధారణ సమావేశం జరుగుతుందని, అదే రోజున మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులకు, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నీటి పంపిణీ సంఘాల అధ్యక్షులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. 14న ఎన్నికల అధికారి నేతృత్వంలో మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల ఎన్నికలకు అసాధారణ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అన్నారు.

విద్యార్థులు పఠనాశక్తిని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రాథమిక దశ నుండే విద్యార్థులు పఠనాశక్తిని అలవర్చుకోవాలని, తెలుగు సాహిత్యంలోని నీతి శతకాలను నేర్చుకోవడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షులు టి.శివకేశవ రావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకటనాయుడు అధ్యక్షతన విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు మెమెంటోలు, బహుమతులను అందజేశారు. ఏడో తరగతి చెందిన ఎర్రా వర్షిణి, ఆరో తరగతికి చెందిన పడాల నందు ప్రథమ, ద్వితీయ స్థానాలను పొందారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంఘం కార్యదర్శి ఎన్.బాలకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు వెంకట నాయుడు, విజయ, నిర్మల, మణి, బివి పట్నాయక్, రమేష్, ఆరుణ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలను చెల్లించి, వారి కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల నుంచి ఆదుకోవాలని కమిషనర్‌కు ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు నగర పంచాయతీ కమిటీ) ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ పాలకొండ నగర పంచాయతీ కమిటీ గౌరవ అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ నగర పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ విభాగాలైన వాటర్ సప్లై, స్ట్రీట్ లైటింగ్ ,టౌన్ ప్లానింగ్, ఫిట్టర్, మెకానిక్, డ్రైవర్, టర్న్ కాక్, ఫంచ్చరింగ్ వెల్డర్, పెయింటర్, గార్డినర్, కంప్యూటర్ ఆపరేటర్, వెటర్నరీ, సెక్యూరిటీ గార్డ్స్, వాచ్ మెన్, తదితర విభాగాలకు చెందిన సుమారు 30 మంది కార్మికులు 20 నుంచి 25ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. వీరికి 2018 వరకు పారిశుద్య కార్మికులతో పాటు సమానంగా జీతాలు చెల్లించారన్నారు. కానీ ప్రస్తుతం పారిశుధ్య కార్మికుల కంటే తక్కువ వేతనాలు ఇస్తున్నారన్నారు. జిఒ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ వర్కర్స్ రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ యాక్టు 1970 ప్రకారం శాశ్వత స్వభావం కలిగి ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రమాదకరమైన పనులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్సు చెల్లించాలని, పనిచేసేందుకు అవసరమైన పనిముట్లు, కిట్లు సకాలంలో అందించాలి. వారాంతపు, క్యాజువల్, జాతీయ సెలవులు అమలు చేయాలనికోరారు. ఇంజనీరింగ్ కార్మికులకు అదనపు పనులు కేటాయించినప్పుడు తప్పని సరిగా టిఎ, డిఎలు చెల్లించాలని ప్రమాద మృతులకు రూ.5లక్షల నుంచి రూ.7లక్షల ఎక్స్ గ్రేషియా పెంపు. దహన సంస్కారాలకు రూ.15వేల నుంచి రూ.20 వేలు పెంపునకు సంబంధించిన జీవోలను వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. వినతిని అందజేసిన వారిలో యూనియన్ ప్రతినిధులు వై.హరిబాబు, ఉమామహేశ్వరరావు, టి.ఈశ్వరరావు, పి.సతీష్, పి.వేణు, సిహెచ్.సంజీవి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పాచిపెంటలో జరిగిన అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు బాలమ్మ, కె.పార్వతీదేవి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈశ్వరరావు, పార్వతీదేవి మాట్లాడుతూ ముఖ్యంగా పాచిపెంట, మక్కువ మండలాల్లోని ఏజెన్సీ గ్రామాల్లో సిగ్నల్స్ లేక యాప్‌లు పనిచేయక పిల్లలకు సంబంధించిన ఎఫ్ఆర్‌సి యాప్ ఇకెవి వంటి యాప్‌లు పనిచేయక తీవ్రమైన మానసిక ఒత్తిడికి అంగన్వాడీ గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి ఇబ్బందులను తొలగించి అంగన్వాడీలపై భారాలు, ఒత్తిడి లేకుండా చూడాలని కోరారు. అలాగే 42 రోజులు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జనన, మరణాల నుంచి ప్రజలకు, పిల్లలకు ఎన్నో సేవలు అందిస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, గ్రాడ్యుటి అమలు చేయాలని కోరారు. సమావేశంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వరి పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పాంచాలిలో కొత్తగా ఇచ్చిన ఎంటియు 13 18 వరి రకంలో రైతు సేనాపతి శ్రీనివాసరావు వరి క్షేత్రంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ సంవత్సరం దిగుబడులు బాగున్నాయని, ఒకటిన్నర క్వింటా దిగుబడి ఎక్కువ వచ్చే అవకాశం ఉందని అన్నారు. అలాగే గతేడాదితో పోలిస్తే చీడ, పీడల ఉధృతి కూడా చాలా తక్కువగా ఉందని తెలిపారు. 150 రోజుల పంట కాల వ్యవధి ఉండి చీడపీడలను తట్టుకుంటుందని తెలిపారు. రాబోయే కాలంలో ఈ 1318 రకం రైతులకు ఆమోదయోగ్యంగా ఉంటుందని తెలిపారు. అలాగే ఫిబ్రవరి వరకూ కొనసాగించే పత్తికి ద్రవ జీవామృతం, జిల్లేడు కషాయం పిచికారి చేసుకుంటే పునరుత్పత్తి పొందుతుందని తెలిపారు. అనంతరం ద్రవ జీవామృతం తయారీ వివరించారు. కార్యక్రమంలో విఎఎ ఈదిబిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు

నియోజకవర్గ సమస్యలపై మంత్రికి వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కురుపాం నియోజక వర్గం జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు నియోజక వర్గంలో గల పలు సమస్యలను ఆయనకు వివరించారు. ఏనుగుల సమస్య, మైనింగ్, చెక్ డ్యాం, నీటి, రహదారులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మర్యాద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీ విప్ కేటాయించడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం సీనియర్ నాయకులు అధికారి అనిల్ కుమార్, కురుపాం, జియమ్మ వలస మండలాల జనసేన అధ్యక్షులు నేరేడబిల్లి వంశీ, వారణాసి శివకుమార్, నాయకులు పల్లి శ్రీకాంత్, డొల్లు శివ ప్రసాద్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి మార్గంలో నడవాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రతి వ్యక్తికి విద్యార్థి దశ చాలా కీలకమని ఆ దశలో విద్యార్థులు మంచి మార్గాల్లో నడవాలని పార్వతీపురం సిఐ ఎస్.గోవిందరావు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్పం అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చట్టాలపై గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించే ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటర్ విద్యార్థులకు కీలక దశని, ఈ దశలో సత్ప్రవర్తనతో ఉంటే భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానానికి ఎదిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై నీలకంఠం, ఎఎస్ఐ నాయుడు కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, కళాశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

సీతానగరం : స్థానిక వెలుగు కార్యాలయంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పలితాలపై ఎస్ఐ రాజేష్ అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడ్డానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సైబర్ నేరాల కోసం అవగాహన కల్పించి వాటి బారిన పడకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక వారపు సంతలో పోలీసులు గిరిజన మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ నరసింహులు మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు వాడిన మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్, రోడ్ యాక్సిడెంట్లు, చట్టాలు, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక బస్టాండ్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణపై ఎస్సై వై.అమ్మనరావు అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, లైసెన్స్, సిబుక్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఆయనతో పాటు పోలీసులు ఉన్నారు.